క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలకు నీరు పోస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని దీనదయాళ్‌నగర్, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో మొక్కలను శనివారం నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. మొక్కలను ప్రతి ఒక్కరూ నాటి వాటిని సంరక్షించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, టీపీఆర్వో ప్రసాద్, ఉద్యానశాఖ ఏడీ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలకు సన్నద్ధం

• కమిషనర్ సూర్యతేజ



సూచనలు చేస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరద ప్రభావానికి లోనయ్యే వివిధ ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని మాగుంట లేఅవుట్, రామలింగాపురం, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జిలు, విజయమహల్ గేట్ సమీపంలోని బాక్స్ టైప్ బ్రిడ్జి పంప్‌హౌస్ తదితర ప్రాంతాలను శనివారం రాత్రి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన మార్గాలు, అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తోడేయాలని సూచించారు. ప్రజాజీవనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనగిరిధారిగా వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): కృష్ణావతార మహోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు గోవర్ధనగిరిధారిగా శనివారం దర్శనమిచ్చారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయంలో వనం.. మనం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వనం.. మనం కార్యక్రమాన్ని పురస్కరించుకొని నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయం, సర్వీస్ హోమ్‌లో మొక్కలను శనివారం నాటారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు నుడా వీసీగా అదనపు బాధ్యతలు

నెల్లూరు(బారకాసు): కమిషనర్ సూర్యతేజకు నుడా వైస్ చైర్మన్ (ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం శనివారం జారీ చేసింది. ఇప్పటి వరకు నుడా వీసీగా విధులు నిర్వర్తిస్తున్న బాపిరెడ్డిని తన మాతృశాఖ రెవెన్యూకు బదిలీ చేశారు.

35వ డివిజన్లో పింఛన్ల పంపిణీ



నెల్లూరు సిటీ: నగరంలోని 35వ డివిజన్ లేక్‌వ్యూ కాలనీలో పింఛన్లను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి మన్నెం పెంచలనాయుడు, వహీదా, నేతలు బర్నబాస్, యాకసిరి ప్రశాంత్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలా.. డోంట్ కేర్

నగరంలో ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు గాలికొదిలేశారు. ట్రిపుల్ రైడింగ్.. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలను నడపడం.. పరిమితికి మించి ఆటోల్లో తరలించడం.. ఇలాంటి దృశ్యాలు నగరంలో నిత్యం దర్శనమిస్తూనే ఉన్నాయి. ఇసుక, ఇటుకలను తరలించే ట్రాక్టర్లపై కూర్చొని పలువురు ప్రయాణాలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ అధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నా, వీరిలో ఎలాంటి మార్పు రావడంలేదు. వీరిపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – నెల్లూరు(క్రైమ్)



ఇటుక ట్రాక్టర్‌పై ప్రమాదభరితంగా



టాటా ఏస్‌లో ఇలా..



బైక్‌పై ట్రిపుల్ రైడింగ్



పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో

ఎల్ఐసీని బలోపేతం చేద్దాం



సమావేశానికి హాజరైన నేతలు

నెల్లూరు(అర్బన్): ఎల్ఐసీని బలోపేతం చేసేందుకు ఉద్యోగులు కృషి చేయాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సౌత్ సెంట్రల్ జోన్ జనరల్ సెక్రటరీ రవీంద్రనాథ్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ కోరారు. దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో శనివారం నిర్వహించిన ఐసీఈయూ డివిజన్ 27వ వార్షిక మహాసభల్లో వారు మాట్లాడారు. రూ.ఐదు లక్షలకన్నా అదనంగా ప్రజలు చెల్లించే ప్రీమియంపై పన్ను విధించడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రీమియంపై విధించే జీఎస్టీని సైతం రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు నిధులను సమకూర్చడంలో ఎల్ఐసీ తన వంతు పాత్రను పోషిస్తోందని చెప్పారు. సంస్థ ప్రైవేట్ పరం కాకుండా అందరూ కాపాడుకోవాలని కోరారు. ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వం తమ వాటాల ఉపసంహరణ ప్రక్రియ చేపట్టడం తగదని చెప్పారు. తొలుత సంస్థ జెండాను ఆవిష్కరించారు. డాక్టర్ రమణయ్య, ఏఐఏఈయూ జోనల్ అధ్యక్షుడు సతీష్, ఐసీఈయూ డివిజనల్ అధ్యక్షుడు సుందర్‌బాబు, మార్కెటింగ్ మేనేజర్ కృష్ణమూర్తి, నేతలు నగేష్, జగదీశ్వరిశర్మ, ఏఓఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రేడియాలజిస్టుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



హాజరైన రేడియాలజిస్టులు

నెల్లూరు(అర్బన్): రోగ నిర్ధారణలో రేడియాలజిస్టుల పాత్ర కీలకమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మినీబైపాస్ రోడ్డులోని పీవీఆర్ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్, ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ పదో రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌ను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. రేడియాలజిస్టులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు పేదలకు తక్కువ ఖర్చుకే పరీక్షలు చేయాలని కోరారు. కోవూరు నియోజకవర్గంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను త్వరలో నిర్వహించనున్నామని, దీనికి రేడియాలజిస్టులు సహకారం అందించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, క్లారిటీ సెంటర్ అధినేత డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 800 మంది రేడియాలజిస్టులు సదస్సులో పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలు ఏజెన్సీలు ఎమ్మారై, సీటీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే తదితర ఆధునిక వైద్య యంత్ర పరికరాలను ప్రదర్శించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వరప్రసాద్, ఆర్గనైజింగ్ చైర్మన్ రామకృష్ణరావు, డాక్టర్లు కిశోర్‌కుమార్, సురేంద్రకుమార్, మురళీకృష్ణ, ఐఎంఏ రాష్ట్ర నేత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాఖ ఉద్యోగికి సత్కారం



నెల్లూరు (లీగల్): నెల్లూరు మొదటి అదనపు జిల్లా కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ ప్రసాద్‌రావును ఆదర్శంగా తీసుకోవాలని నెల్లూరు ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గీత పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ప్రసాద్‌రావుకు అభినందన సభను జిల్లా కోర్టు హాల్లో న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సింహపురి కూల్.. కూల్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సింహపురిలో వాతావరణం కూల్.. కూల్‌గా శనివారం మారింది. చిరుజల్లులు ఉదయం నుంచి కురుస్తూనే ఉన్నాయి. కొంతకాలంగా ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు దీంతో ఉపశమనం పొందారు. – నెల్లూరు(బారకాసు)



గొడుగు సాయంతో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు



మినీబైపాస్ రోడ్డులో కురుస్తున్న వర్షం

నిష్పక్షపాత విచారణకు వినతి

నెల్లూరు(క్రైమ్): పేదల ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నామమాత్ర విచారణ చేస్తున్నారని, నిష్పక్షపాతంగా జరపాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు కరెంటాఫీస్ సెంటర్‌లోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు.

గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వరూ..

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందించాలని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు కోరారు. ఈ మేరకు మంత్రి నారాయణకు వినతిపత్రాన్ని ఉత్సవ సమితి అధ్యక్షుడు సత్యనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కోశాధికారి మోహన్‌రావు, మండ్ల ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు శనివారం అందజేశారు.

కార్యాలయ ప్రారంభం నేడు

నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నామని నిర్వాహకులు తెలిపారు. సింగిల్ విండో అనుమతులకు సంబంధించిన దరఖాస్తులను ఇక్కడ స్వీకరించనున్నామని చెప్పారు.

శంకరమఠంలో రుద్రహోమం రేపు

నెల్లూరు(బృందావనం): శ్రావణ అమావాస్యను పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో మహా మృత్యుంజయ అమృత పాశుపత రుద్రహోమాన్ని సోమవారం నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొర్రపాటి నంద కిశోర్, ఉషాకుమారి దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనాలనుకునే వారు 96528 60264. 99499 18358 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జయభారత్ ఆస్పత్రిలో దుస్తుల పంపిణీ



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో గల డయాలసిస్ వార్డులో పని చేస్తున్న 22 మంది ఆయాలకు పసుపు, కుంకుమతో పాటు చీరలను ఆరెస్సెస్ నేత మెంటా రామ్మోహన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. అదే విధంగా 14 మంది వార్డు బాయ్‌లకు ప్యాంట్లు, షర్ట్‌లను పంపిణీ చేశారు. శ్రావణమాసం, నారీ సమ్మేళనాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నేతలు కందికట్ల రాజేశ్వరి, విజయ్, సుజాత, మిడతల లక్ష్మి, సునందినీదేవి, వెంకటమౌనిక తదితరులు పాల్గొన్నారు.

వారి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి



నెల్లూరు(దర్గామిట్ట): ఉద్యోగ విరమణ పొందిన వారి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పరిపాలనాధికారి ప్రభావతిబాయి, సీనియర్ అసిస్టెంట్లు ప్రసాద్‌రెడ్డి, రియాజ్ అహ్మద్, ఆఫీస్ సబార్డినేట్ ముంతాజ్‌బేగానికి అభినందన సభను జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. అనంతరం వీరిని సత్కరించారు. డిప్యూటీ సీఈఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్లీన్ - గ్రీన్ ర్యాలీ



నెల్లూరు (టౌన్): మాగుంట లేఅవుట్లోని విశ్వసాయి, ఎస్సార్కే స్కూల్లో క్లీన్ - గ్రీన్ ర్యాలీని శనివారం నిర్వహించారు. సేవ్ ది ప్లానెట్ అనే అంశంపై పూల మొక్కలు, భూగోళ నమూనాతో స్కూల్ నుంచి మినీబైపాస్ వరకు ర్యాలీని జరిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. నగరంలోని రామచంద్రాపురం, ఎఫ్‌సీఐ కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆమె మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్, బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ తదితరాలను చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. చెత్త, మురుగు నిల్వ ఉంటే నగరపాలక సంస్థ అధికారులకు తెలియజేయాలని కోరారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ తదితరులు

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది తమ శేషజీవితాన్ని కుటుంబంతో హాయిగా గడపాలని ఎస్పీ కృష్ణకాంత్ కాంక్షించారు. ఏఆర్ఎస్సై ప్రసాద్, సంతపేట హెచ్‌సీ శ్రీనివాసులు ఉద్యోగ విరమణ పొందడంతో నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో వీరికి వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, తురకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఉచిత దంత సేవలు



పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్): నారాయణ డెంటల్ కళాశాలను స్థాపించి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తమ ఆస్పత్రిలో ఉచిత దంత వైద్యసేవలను ప్రవేశపెడుతున్నామని ప్రిన్సిపల్ అజయ్ రెజినాల్డ్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను కళాశాలలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 92 మంది నిపుణులతో దంత చికిత్సలను ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రాయితీ, ఉచితంగా అందించనున్నామని వివరించారు. వివిధ సేవలను తక్కువ ధరకే అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 73311 70047, 77804 73823 నంబర్లను సంప్రదించాలని సూచించారు. డాక్టర్లు పవన్‌కుమార్, దిలీప్‌నాగ్, వంశీకృష్ణారెడ్డి, శరణ్‌బాబు, అరవింద్‌రెడ్డి, ఏజీఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రితో భేటీ



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం



నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో డెమో అధికారిగా శ్రీనివాసరావు అంకితభావంతో విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకున్నారని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను సత్కరించారు. హంస అసోసియేషన్ అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, శ్రీనాథ్, హెల్త్ ఎడ్యుకేటర్స్ గౌరవాధ్యక్షుడు నవాజ్‌ఖాన్, డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం, హెచ్ఈఈఓ ధర్మేంద్ర, హంస నేతలు నాగరాజు, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్‌కు ఎమ్మెల్సీ పరామర్శ



నెల్లూరు(బారకాసు): డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌ను జెండావీధిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

భూగర్భ డ్రైనేజీ పనులు పునఃప్రారంభం

• మంత్రి నారాయణ



పనులను ప్రారంభిస్తున్న నారాయణ

నెల్లూరు(బారకాసు) / నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భూగర్భ డ్రైనేజీ పనులను పునఃప్రారంభిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరంలోని 53, 54వ డివిజన్లలో భూగర్భ డ్రైనేజీ, కాలువల పనులను ఎల్ అండ్ టీ, మెగా కంపెనీ ప్రతినిధులు తదితరులతో కలిసి శనివారం పునఃప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పనులను వేగవంతం చేయనున్నామని చెప్పారు. అన్ని గృహాల డ్రైనేజీ వ్యవస్థను భూగర్భం ద్వారా అనుసంధానించి మురుగునీటి శుద్ధి కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపడతామని వివరించారు. దీనికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని వెల్లడించారు. కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, అనూరాధ, రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్‌నగర్, రాయపుపాళెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు. కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన కృష్ణ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి జశ్వంత్‌ను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం అభినందించారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ నెల తొమ్మిది నుంచి నిర్వహించనున్న హాకీ పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. అక్కడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు.